19న 25వ రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలు

- పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్
- అసోసియేషన్ సెక్రటరీ విజయ్‌కి కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : జిల్లాలో మార్చి 19న నిర్వహించనున్న 25వ రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు వరుసగా సిక్కోలులో తొమ్మిది రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి పదోసారి నిర్వహించేందుకు సిద్ధమవుతుండడం అభినందించదగ్గ విషయమని అన్నారు. ఈవిధంగా పోటీలు నిర్వహించి బాడీబిల్డర్లను ప్రోత్సహిస్తున్న ఏపీ బాడీబిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ కృషి అభినందనీయమన్నారు. ఏపీ బాడీబిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మార్చి 19న శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ ఛాంపియన్‌షిప్-2023 పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రూ.1,15,000 నగదు ప్రోత్సాహకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 350 మంది బాడీబిల్డర్లు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి బాడీ బిల్డర్లు పాల్గొంటున్నారని కలెక్టర్‌కు విజయ్ కుమార్ వివరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎన్.ఈశ్వరరావు, సామ్నా రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎం.వి మల్లేశ్వరరావు, జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బి. ప్రసాద్, జర్నలిస్టులు ఆకుల కృష్ణ గొండు మణితేజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం చూసి పట్టభద్రులు ఓటేయాలి

ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు, జడ్పీటీసీ వెంకటరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటును వేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలకు ఇప్పటికే ఓటర్ల లిస్టు పంపించటం జరిగిందని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ పంచాయతీ పరిధిలో గల పట్టభద్రుల ఓటర్లును కలిసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు వేసేవిధంగా చేయాలని కోరారు. అలాగే మండల ఎంపీటీసీలు అందరు వైఎస్సార్‌సీపీ జిల్లా ఎమ్మెల్సీ నర్తు రామారావుకి ఓటు వేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అన్నెపు రామారావు, రాష్ట్ర కళింగ కర్పొరేషన్ డైరెక్టర్ సంపతిరావు హేమసుందరరాజు, పంకు రాము, పేడాడ వెంకటరావు, సింగుపురం వినోద్, తేజేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి రాము, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-పలాస: ఈనెల 13న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ, స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని పలాస ఆర్డీవో పి.సీతారామ్మూర్తి అధికారులకు ఆదేశించారు. పలాస ఆర్డీవో కార్యాలయంలో శనివారం పలాస డివిజన్ పరిధిలో ఉన్న పోలీసు అధికారులు, తహాశీల్దార్లుతో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలను పలాస తహాశీల్దార్ కార్యాలయంలో పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ప్రతి మండల కేంద్రంలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అందుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తులు ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఎస్‌పి శివరాంరెడ్డి, వివిధ మండలాల తహాశీల్దార్లు, సి.ఐలు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం : సంయుక్త కలెక్టర్ నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : జిల్లాలో స్థానిక సంస్థలు ఎన్నికలకు నాలుగు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని, పట్టభద్రుల శాసనమండలి కి 59 కేంద్రాలు కలిపి 63 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 300 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసామని శ్రీకాకుళం జిల్లా సంయుక్త కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్ అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరంలో పలు కేంద్రాల్లో స్ట్రాంగ్ రూమ్స్ మరియు పోలింగ్ మెటీరియల్ పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి 52వేల మంది ఓటర్లు ఉన్నారని, స్థానిక సంస్థలకు 776 మంది ఓటర్లు ఉన్నారని జేసీ వెల్లడించారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 38మండలాల పరిధిలో ఉన్న ఎం.పి.టి.సి., జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సెలర్స్ ఓటు హక్కును వినియోగించికుంటారు. నాలుగు రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో స్థానిక సంస్థలకు 4పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టభద్రుల శాసనమండలికి సంబంధించి ఓటర్లకు ఓటింగ్ స్లిప్ ల పంపిణీ 40 శాతం పూర్తి అయిందని, మిగిలిన 60 శాతం మూడు రోజుల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీటీవీలు ఏర్పాటుచేస్తున్నామని, ఓటర్లు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించు కునేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని జేసీ నవీన్ అన్నారు. ఈ ఎన్నికలకు సుమారు 2వేల మంది సిబ్బందిని విధులకు వినియోగిస్తున్నామని ఆయన అన్నారు.

చిరంజీవికి మద్ధతుగా ఎమ్మెల్యే అశోక్ ప్రచార హోరు

విశాలాంధ్ర-సోంపేట : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిని గెలిపించాలని కోరుతూ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం సోంపేట మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టి ప్రచారాన్ని హోరెత్తించారు. ఈ మండలం ఎర్రముక్కాం, నడుమూరు, మామిడిపల్లి, పాలవలస, కర్తలిపాలెం, పొత్రఖండ, బేసి రామచంద్రాపురం, కొర్లాం, సోంపేట గర్ల్స్ హైస్కూల్, బాయ్స్ హైస్కూల్, బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాల, సోంపేట జూనియర్ కళాశాల, పలాసపురం హైస్కూల్‌లలో ఉపాధ్యాయులను, లెక్చరర్లను కలిసి చిరంజీవికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా ఉద్యోగులు, ప్రజలు పక్షాన ఉంటూ ఎల్లప్పుడు అభివృద్ధికి కృషి చేస్తుందని పేర్కొన్నారు. టీడీపీ మద్ధతుతో బరిలో ఉన్న చిరంజీవికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిహెచ్.శ్రీనివాస్, మాజీ జెడ్పీటిసి ఎస్.చంద్రమోహన్, మండలస్థాయి నాయకులు పాల్గొన్నారు.

మరువాడలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మరువాడ పంచాయతీలో గల అన్ని గ్రామాల్లో గత మూడు రోజుల నుంచి ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, మరువాడ పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి, మరువాడ విద్యా కమిటీ చైర్మన్, జిల్లా తెలుగుదేశం పార్టీ యువత కార్యదర్శి సూరాడ దాసురాజు తెలిపారు. పారిశుధ్య కార్యక్రమం ప్రతి వార్డులో ఉన్న ప్రజలు అందరి బాధ్యతని ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్య సమస్యలను దాటవచ్చని అన్నారు. పంచాయతీలో గల ఆర్ మరువాడ, గుడ్డిమీదపేట, చొక్కరివానిపేట, ఎస్సీ మరువాడ, డి మరువాడ, చిన మరువాడ గ్రామాలలో కాలువలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేయించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు కృష్ణవేణి, పార్వతి, ఆయా వార్డుల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రిలియన్స్ స్మార్ట్ పాయింట్‌ను ప్రారంభించిన ఎంపీ కింజరాపు

విశాలాంధ్ర-కొత్తూరు : మండల కేంద్రం, వ్యాపార కూడలిగా ఉన్న కొత్తూరులో ప్రముఖ వాణిజ్య దిగ్గజం రిలీయన్స్ సంస్థ స్మార్ట్ పాయింట్ పెరుతు భారీ షాప్ ను శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌రావు శనివారం ప్రారంభించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ వాణిజ్య, పారిశ్రామిక సంస్థ కొత్తూరులో స్మార్ట్ పాయింట్ పేరుతో తన వ్యాపారాన్ని ప్రారంభించడం మంచి పరిణామం. ఈ ప్రాంతం వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతుంది, కొందరికైనా ఉపాధి లభిస్తుందని ఆయన అన్నారు. తొలి కొనుగోలును ఎంపీ కింజరాపు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మాజీ ఎమ్మెల్యే కలమట మోహన్‌రావు, మరో మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణమూర్తి, స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

జగనన్నా... రైతన్నను కరుణించవా...?

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : మండలంలోని రైతులు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. ధాన్యం కొనేవారు కానరాక, ప్రభుత్వం కొనుగోలు చెయ్యక, రైతు పొలంలో బస్తాల పోగులు దర్శనమిస్తున్నాయి. వర్షం పడితే పంట మొత్తం గోవిందే. అయితే అధికారులు మాత్రం ఏం పట్టనట్లు చూస్తున్నారు. రైతులు ఇంకెన్నాళు పంటను కాపలా కాయాలంటున్నారు. అందరికి ఉచితాలు ఇచ్చి సోమరిపోతులు చేస్తున్న సీఎం కష్టపడే రైతులను, రైతు కులీలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నిస్తున్నారు. దేశానికి అన్నంపెట్టే రైతుకు గెంజినీళు లేకుండా చేయటం న్యాయమా...? అని నిలదీస్తు న్నారు. రైతు సంఘం నాయకులారా ముందుకు రండి, మాకోసం పోరాటం చెయ్యండి అని అన్నదాతలు ప్రాధేయపడుతున్నారు. దిశా నిర్దేశం చేసే యువత దేశ భవిష్యత్, రైతు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన విషయాన్ని గమనించాలని రైతులు భావోద్వేగానికి లోనవుతున్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న ఎయిమ్స్ డైరెక్టర్

విశాలాంధ్ర-అరసవల్లి : ఎయిమ్స్ డైరెక్టర్ డా.ముఖేష్ త్రిపాఠి, అరసవల్లి శ్రీ సూర్య నారాయణ స్వామిని, శ్రీకూర్మం దేవాలయంలో శ్రీకూర్మనాధుని శనివారం దర్శించుకున్నారు. అదేవిధంగా అరసవల్లి అర్బన్ హెల్త్ సెంటర్, వప్పంగి సబ్‌సెంటర్, శ్రీకూర్మం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డా. ముఖేష్ త్రిపాఠి మాట్లాడుతూ శ్రీకాకుళం వైద్యఆరోగ్యశాఖ పనితీరుపై హర్షం వ్యక్తం చేశారు. ఈయనతోపాటు సూపరింటెండెంట్ ఆఫ్ ఎయిమ్స్ డా.వంశీకృష్ణ రెడ్డి, ఎస్.పి.హెచ్.ఓ డా. ఎన్.రామిరెడ్డి, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మంతెన వెంకటస్వామి, డా.పద్మావతి, నాగభూషణం, నాగేశ్వరరావు, మోహిని తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కవిటి : ఏపీజీవీ బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్ గౌతమ్ అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని దూగానపుట్టుగ గ్రామంలో స్థానిక సర్పంచ్ దూగాన భద్రాచలం అధ్యక్షతన ఖాతాదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక భద్రతా, భీమాలు, బ్యాంక్‌లో వివిధ రుణాలు, డిపాజిట్ల గూర్చి ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏరియా మేనేజర్ ఎం మాధవ సాహు, బ్యాంక్ మిత్ర దుగాన సంధ్య, వీవోఏ దుగాన మంజులత, వార్డు సభ్యులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం గొల్లగండి గ్రామంలో శనివారం శ్రీకాకుళం జెమ్స్ మరియు కిమ్స్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనేక గ్రామాలకు చెందిన వందలాది మంది రోగులు హాజరయ్యారు. వైద్యులు రోగులను పరిశీలించి వివిధ రక్త పరీక్షలు కూడా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యం అవసరమైన రోగులకు శ్రీకాకుళం తరలిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్యులతో పాటు గ్రామ సర్పంచ్ నాగం భాస్కరరావు, ఎంపీటీసీ మద్దు ఈశ్వరరావు, తెప్పల సుందరరావు, తెప్పల యాదవరావు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

రబీలో సాగుచేసే అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియ ప్రారంభం

రైతు భరోసా కేంద్రాలలో పేర్లను నమోదు చేయించుకోవాలి : జాయింట్ కలెక్టర్ నవీన్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లా వ్యాప్తంగా రబీ 2022-23 సీజనులో అపరాల కొనుగోలుకు నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా రబీ 2022-23 సీజను లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు గాను నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, క్వింటా మినుములకు రూ.6,600లు, క్వింటా పెసలకు రూ.7,755లు గా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందన్నారు. కావున, అపరాలు సాగుచేసి ఈ - క్రాపు, ఈ - కెవైసి చేయించుకున్న రైతులు తమ ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించుటకు గాను తమ పరిధిలో గల రైతు భరోసా కేంద్రాలలో పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. తమ పంటను విక్రయించదలచిన రైతులు తప్పనిసరిగా నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పంటను శుభ్రపరచి, జల్లెడ పట్టి సిద్ధం చేసుకోవాలని, ఈ అవకాశాన్ని రైతు సోదరులందరూ సద్వినియోగపరచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మోడీ హయాంలో మూడు రెట్లు పెరిగిన వంట గ్యాస్ ధరలు

- బీజేపీ పాలనలో సామాన్యుల బతుకు భారం
- పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాల్సిందే
- సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర-అరసవల్లి : నల్ల ధనాన్ని వెలికితీస్తా..దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తానని మాయమాటలతో గద్దెనెక్కిన ప్రధాని మోడీ హయాంలో మధ్య తరగతి, సామాన్యుల ప్రజలు బతుకులు భారంగా తయారయ్యాయని, మోడీ హయాంలో వంట గ్యాస్ ధరలు మూడు రెట్లు పెరిగాయని, పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రామలక్ష్మణ కూడలిలో పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మోడీ గద్దెనెక్కిన సమయానికి రూ.414లు ఉన్న వంటగ్యాస్ ధర నేడు దాదాపు రూ.1200లకు చేరువయ్యిందని, అంటే మూడు రెట్లు పెరిగిందని, మోడీ హయాంలో దేశం శరాఘాత భారతంగా తయారయిందని విమర్శించారు. పేదలను దోచి, పెట్టుబడిదారులకు పెట్టడమే పనిగా బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని, మోడీ హయంలో దేశం తిరోగమన దిశగా పయనిస్తుందని విమర్శించారు. బీజేపీ హయంలో మతోన్మాధ దాడులు అధికమయ్యాయని, మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి, మోడీ, అమిత్‌షాల ద్వయం పాలన సాగిస్తుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు అడ్డు అదుపు లేకుండా పెంచడంతో దాని ప్రభావం వలన నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటాయని, దీంతో పేదలు కనీసం రెండు పూటలు తినేందుకు కూడా కష్టమవుతుందని ఈపాపం మోడీదేనన్నారు. పెంచిన ధరలను తగ్గించే వరకు మా పోరాటం ఆగదని, మోడీని గద్దెదించితేనే తప్ప దేశానికి భవిష్యత్ ఉండదని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు డోల శంకరరావు, ఏఐటీయుసీ సహాయ కార్యదర్శి కొమర భాస్కరరావు, రైతు సంఘం నాయకులు పి. అప్పారావు, డీహెచ్‌పీఎస్ నాయకులు బలగ రామారావు, పట్టా ప్రసాద్, కలగ సాయికుమార్, డి. అప్పారావు తదితరులు ఉన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీతంరాజు సుధాకర్‌ని గెలిపించాలి

వైసీపీ యువ నాయకులు చిరంజీవి నాగ్

విశాలాంధ్ర-పొందూరు : ఉత్తరాంధ్ర అభివృద్ధి పదం వైపు నడవాలన్నా, వలస వెళ్లిన రైతు కూలీలు మళ్లీ తిరిగి వచ్చి జిల్లాలో హాయిగా బ్రతకాలన్న వైఎస్ఆర్ పార్టీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ ని గెలిపించాలని వైయస్సార్ పార్టీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి పేర్కొన్నారు. శనివారం పొందూరు జేవియర్ ఫంక్షన్ హాల్లో పొందూరు మండల క్యాడర్‌తో ఎమ్మెల్సీ ఎన్నికలపై పార్టీ క్యాడర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పోవాలన్న నిరుద్యోగం పోవాలన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి నిర్దేశించిన అభ్యర్థి సీతమ్మరాజు సుధాకర్‌ని గెలిపించడం చారిత్రక అవసరమని చిరంజీవి నాగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆమదాలవలస నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటర్ని బూత్‌కు తీసుకువెళ్లి ఓటు పడేవిధంగా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్క బూత్ కమిటీ సభ్యులపై ఉందని ఆయన అన్నారు. మొదట ప్రాధాన్యత ఓటు పడేవిధంగా ప్రతి ఓటర్‌కి వివరించి ఓటు పడేవిధంగా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, జెడ్పీటీసీ లోలుగు కాంతరావు, మండల, టౌన్ పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, గాడు నాగరాజు, పిఏసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు, మార్కెట్ కమిటీ అధ్యక్షులు బడాన సునీల్, సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో ఆరు లక్షల ఉద్యోగాలు!

వైఎస్సార్‌సీపీ నాయకుడు, రాష్ట్ర యాదవ సంఘ అధ్యక్షులు గురునాధ్‌యాదవ్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా ఆరు లక్షల ఉద్యోగాలు ఏపీ యువతకు దొరుకుతాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, రాష్ట్ర యాదవ సంఘ అధ్యక్షులు గురునాథ్ యాదవ్ అన్నారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లుతో మాట్లాడుతూ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు అనూహ్య స్పందన లభించిం దని, విశాఖ వేదికగా రాష్ట్రంకి అనేకమంది పారిశ్రామిక వేత్తలు వచ్చి అనేక కంపెనీల పెద్దలం దరూ హాజరై పెద్ద ఎత్తులో పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలోని ఎక్కువ దేశాల ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చార న్నారు. సుమారు 340 పారిశ్రామిక ఒప్పందాలు కుదుర్చు కోవడం జరిగిందని, రాష్ట్రానికి 13 లక్షల కోట్ల పెట్టుబడులు బయట నుంచి వస్తూ ఉన్నాయని దీంతో సుమారు 20 రంగాల్లో ఆరు లక్షల ఉద్యో గాలు ఏపీ యువతకు దొరుకు తాయన్నారు. విదేశీ కంపెనీలు వచ్చి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడులు పెట్టడానికి కారణమైనటు వంటి ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ప్రజలందరూ రుణపడి ఉంటార న్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఏపిఎంఎంఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్

విశాలాంధ్ర-ఆమదాలవలస: రాష్ట్రంలో నానాటికీ తీవ్రమవుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డ్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవ హరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో భాగంగా ఎపి జెఏసీ అమరావతి కార్యాచరణపై శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన కమిషనరు కె.అపలనాయుడు (పూ.అ.భా) ను, ఉద్యోగు లను కలిసి మద్దతు కోరారు. ఈసందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ ఉద్యోగ సమస్యల పరిష్కారంలో భాగంగా స్వయంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలే అమలుకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగులంటే ప్రభుత్వంలో భాగమేనని అలాంటి ఉద్యోగుల న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో తాత్సారం సమంజసం కాదన్నారు. తమ సమస్యలు పరిష్కారంలో ఇబ్బందులు కలుగుతున్నప్పటికీ ఏరోజూ ప్రభుత్వ విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వర్తిస్తున్నామని గుర్తుచేశారు. ఇది గమనించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగ సమస్యల పరిష్కారానికి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కానిపక్షంలో తదుపరి కార్యా చరణ ప్రకారం నిరసన కార్యక్రమాలు చేపడ తామని స్పష్టంచేశారు. ఈ దిశగా అందరు సంసిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో నాయుడు బాబు, మేనేజర్ బి.లక్ష్మీ నారాయణ, టి.పి.ఎస్ హెచ్.వి సత్యనారాయణ, ఆర్.ఐ డి.రామారావు, కె.వి.సుబ్రహ్మణ్యం, అకౌంటెంట్ ఐ.సాయిరాం, బి.శ్రీనివాసరావు, ఎస్.హరీష్, జె.శ్రీనివాసరావు పద్మనాభం, హరిబాబు తదితర వార్డు సచివాలయ కార్య దర్శులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశలోనే నిర్ధారించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశలోనే నిర్ధారించుకోవాలని, అప్పుడే నివారణకు సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డిఎల్ఎస్ఎ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శనివారం మండలం అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ సేవా, వైద్య శిబిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని మీనాక్షితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కిడ్నీ వ్యాధి విస్తరించి ఉందని, అయితే ఉద్దాన ప్రాంతంలో కొంత అధికంగా వ్యాపించిందని అన్నారు. కృష్ణ జిల్లాలో కూడా కిడ్నీ వ్యాధి ఉన్నట్లు గుర్తు చేశారు. వ్యాధి నిర్ధారణ పట్ల ఎలాంటి అధైర్య పడవద్దని, ప్రతి ఒక్కరు సి.కె.డి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సి.హెచ్.సి, పి.హెచ్.సిల్లో అందిస్తున్న ఉచిత వైద్య సేవలు మందులు సద్వినియోగం చేసుకోవా లని అన్నారు. ఉద్దానంలో బాధితులు పడుతున్న ఇబ్బందులను చూసి తనవంతుగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కిడ్నీవ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని మీనాక్షి మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంలో 5.70 లక్షల మందికి సి.కె.డి పరీక్షలు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే 13,380 మంది సికెడితో బాధపడుతున్నట్లు గుర్తించామని, ఇప్పుడు మరో 70 కొత్త కేసులు వచ్చినట్లు తెలిపారు. వీరందరికీ స్థానిక ప్రభుత్వాసుపత్రి ద్వారా అన్ని రకాల మందులు అందిస్తున్నామని అన్నారు. 25 ఏళ్లు దాటిన వారంతా వైద్య పరీక్షలు చేసుకునేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని అన్నారు. అలాగే ప్రతి శనివారం పలాస ప్రభుత్వాసుపత్రిలో నెఫ్రాలజిస్టు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. అంతకుముందు కిడ్నీ బాధితులు వైద్యాధికారులతో, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమావేశమై వారి సమస్యలు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 310 మందికి సికెడి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు స్థానిక వైద్యాధికారులు విజయరెడ్డి, దివ్యలు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి సన్యాసినాయుడు, పలాస జూనియర్ సివిల్ జడ్జి రవిశంకర్,నెఫ్రాలజిస్టు విద్యాసాగర్, తహాశీల్దార్ అప్పలస్వామి, ఎంపిడివో ఈశ్వరమ్మ, ఉపసర్పంచ్ కోడ సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్ రామలింగంతో పాటు న్యాయవాదులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏడు బీఈడీ కళాశాలల్లో అడ్మిషన్లు నిలిపివేత

విశాలాంధ్ర-ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రతినెలా నిర్వహించే డైల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం శనివారం విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు ఆధ్వర్యంలో జరిగింది. వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులు పలు అంశాలపై ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమంలో ప్రశ్నలను అడిగారు. బీఈడీ కళాశాలకు చెందిన ఓ అధ్యాపకుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా సిడిసి డిన్ ప్రొఫెసర్ పీలా సుజాత 2022 విద్యా సంవత్సరానికి సంబంధించి 7 బీఈడీ కళాశాలలకు తొలి విడత కౌన్సిలింగ్లో అడ్మిషన్లను నిలిపివేశారన్నారు. పలు బిఈడి కళాశాలలో నిబంధనలో పాటించడం లేదని ఆ అధ్యాపకుడు చేసిన ఫిర్యాదుపై స్పందించి వర్సిటీ పరిధిలో ఉన్న 14 బిఈడి కళాశాలలో ఏడు కళాశాలలకు తొలివిడత కౌన్సిలింగ్లో అడ్మిషన్లు నిలిపివేశారని సి డి సి డీన్ చెప్పారు. డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు, పునః మూల్యాంకన ఫలితాల వెల్లడి పై పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నకు డిగ్రీ పరీక్షల ఫలితాల వెల్లడిలో జాప్యం చేయొద్దని విసి సంబంధిత అధికారులను ఆదేశించారు. డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారని పలువురు విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు పరీక్షల డీన్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ స్పందించి ప్రతి మూడేళ్లకోసారి ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. డిగ్రీ పేపర్ల మూల్యాంకనం, బకాయిలను చెల్లించాలని టెక్కలికి చెందిన అధ్యాపకుడు అడిగిన ప్రశ్నకు కొన్ని మూల్యాంకన కేంద్రాల నుంచి బిల్లులు రాకపోవడం వల్లనే చెల్లింపులో జాతీయం జరుగుతుందన్నట్లు అధికారులు సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్రప్రసాద్, వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, రీవాల్యుయేషన్ డీన్ డాక్టర్ ఎం అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మేఘవరంలో భారీ అగ్నిప్రమాదం

- 15 ఎకరాల్లో జీడి, కొబ్బరి తోటలు దగ్ధం
- లక్షలు ఆస్తి నష్టం, - రెవెన్యూ అధికారులు పరిశీలన



విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం మేఘవరం పంచాయతీలో కల, మేఘవరం పరిసర ప్రాంతాల్లో ఉన్న జీడి తోటలు, కొబ్బరి తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ అగ్ని ప్రమాదంలో పరపటి తేజారావు, అమ్ముడమ్మ, గంట గోవింద, గుజ్జు దాలయ్య,,సత్తుబారి రవి సూరాడ నూకమ్మ, పరపటి లక్ష్మీనారాయణ, సత్తుబారి నూక రెడ్డి, సత్తుబారి రామిరెడ్డి, గోతాల రామారావు, గిన్ని గణపతి రెడ్డి, సత్తుబారి జగన్మోహన్ రెడ్డి, గిన్ని గరల కంఠం, గిన్ని గణపతి, గిన్ని మోహన్ రెడ్డి, టేకరి మల్లేశ్వరరావు, మేఘవరం ముకుందరావు, గిన్నె మల్లేశ్వరరావు, గిన్ని గరలకంటం, గిన్ని శ్రీనివాసరావు తో పాటు మరి కొంతమంది రైతులు కు చెందిన తోటలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆస్తి నష్టం జరిగింది, శనివారము జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 15 ఎకరాలలో ఉన్న జీడి తోటలు, కొబ్బరి తోటలు అగ్నికి ఆహుతయాయని రైతులు తెలిపారు. స్థానిక రైతులు సమాచారం మేరకు రెవిన్యూ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. టెక్కలి నుంచి అగ్నిమాపకాశకటం వచ్చి మంటలను అదుపు చేసినట్లు రైతులు తెలిపారు. అగ్నికి ఆహుతైన రైతులు వివరాలను తాసిల్దార్ కు సమర్పించినట్లు రెవెన్యూ అధికారులు,ఆర్ ఐ మౌళి, విఆర్వో లు వీరియ రమణ, ప్రసాద్‌రావు, అప్పారావులు తెలిపారు.

మేజరు పంచాయితీపై వచ్చిన అభియోగాలపై డిఎల్పీవో విచారణ

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మేజరుపంచాయితీపై వచ్చిన అభియోగాలపై కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి సూచన మేరకు శ్రీకాకుళం డిఎల్పీవో పి.ప్రకాశరావు శనివారం పంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. పంచాయతీకి చెందిన ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్ తీర్మాణం లేకుండా విక్రయించారని, ఆర్థిక లావాదేవీల విషయంలో అవకతవకలు జరిగినట్లు కొద్ది రోజుల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్ళాయి. ఫిర్యాదులపై పంచాయతీ వార్డు సభ్యుల నుంచి విచారణ చేయడంతోపాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడారు. ట్రాక్టర్. ట్యాంకర్ను తీర్మాణం లేకుండా విక్రయించి నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామన్నా రు. మినిట్సుక్లో ఎవరికి కొటేషన్ ఇవ్వడం జరిగిందనే విషయాలు లేవని చెప్పారు. పాలకవర్గ సమావేశంలో అంశాలకన్నా సభ్యులకు తెలియకుండా మినిట్సుక్‌లో ఎక్కువ తీర్మానాలు పొందుపరిచినట్లు గుర్తించడం జరిగిందన్నారు. నిభంద నలకు విరుద్ధంగా పంచాయతీకి అలాటైన బడ్జెట్కు మించి పనులు చేసినట్లు గుర్తించడం జరిగిందని ఇది నిభందనలకు విరుద్ధమన్నారు. పంచాయతీ ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదులపై త్వరలో పూర్తిస్థాయి విచారణ జరుపుతామన్నారు. ప్రస్తుతవిచార ణపై జిల్లా అధికారులకు పూర్తి నివేదిక అందిస్తామన్నారు డిఎల్పీవోతోపాటు ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారి మురళి ఉన్నారు.

మహిళలు అడ్డంకులను అధిగమించి రాణించాలి : ఎంపీడీవో ఫణీంద్రకుమార్

శాలాంధ్ర-కోటబొమ్మాళి : మహిళలు ఎంచుకున్న రంగంలో లక్ష్యసాధనకు అడ్డంకులను అధిగమించి రాణించాలని స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె. ఫణీంద్రకుమార్ అన్నారు. జాతీయ మహిళ దినోత్సవం ఉత్సవాల్లో భాగంగా ఆయన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో న్యాయవాధులు, వెలుగు సిబ్బంది, అంగన్వాడీ అధికారులతో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు ఈ నెల 4వ తేదీనుంచి 11వ తేదీవరకు జరగనున్నాయన్నారు. మహిళలకు అదర్శవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మహిళలు వివిధ సవాళ్లను ఎదుర్కొవడంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించారు. పిల్లలను పెంచడంలో మాతృమూర్తిగా విశిష్ట పాత్ర కలదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయవాధులు పలు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఆస్తిలో సమాన వాటా పొందే హక్కు వున్నదని, అలాగే భాద్యతలను కూడా పంచుకోవా లని, బాలికలను బాలురతో సమానంగా చూడాలని, బాలికలకు కూడా విద్య విషయక హక్కులను సమానంగా అందించాలని తెలిపారు. మహిళలపై లైంగిక దాడులు లేదా ఇతర దాడులకు పాల్పడేవారికి తీవ్రమైన జైలు శిక్షలు, జరిమానాలు ఉన్నవని తెలిపారు. గృహహింస చట్టంను చిన్న చిన్న విషయాలకే కేసులు పెట్టకుండా, సమస్య వున్నప్పుడు ఓకే చక్కని ఆయుధంగా వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళంకు చెందిన ఎన్సీడబ్ల్యూ రిసోర్సు పర్సన్స్, సీనియర్ న్యాయవాధులు డి.విజయలక్ష్మి, డి. సరళకుమారి, న్యాయవాదులు పల్లి వాసుదేవరావు, వి.అప్పలనాయుడు, కె.కృష్ణమూర్తి, ఏఎస్ఐ, అంగన్వాడీ సూపర్వైజర్ కె.సంధ్యారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎస్లు ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయత, అనురాగానికి పుట్టినిల్లు ఉద్దానం

పద్మశ్రీ, మృదంగ సామ్రాట్ యల్లా వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర-కవిటి : ఉద్దాన ప్రాంతం ఆత్మీయత అనురాగానికి పుట్టినిల్లని పద్మశ్రీ, మృదంగ సామ్రాట్ యల్లా వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని బెజ్జిపుట్టుగ గ్రామంలో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ స్వామివారికి యల్లా వెంకటేశ్వరరావు దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు,అర్చక స్వాములు యల్లా వెంకటేశ్వరరావు దంపతులకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు పి కృష్ణారావు, పీవీఎస్ రాంబాబు తోపాటు గ్రామస్తులు యల్లా వెంకటేశ్వరరావు దంపతులకు శాలువాతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపిక గా అందజేశారు. అనంతరం యల్లా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఉద్దాన ప్రాంతంతో తనకు మంచి సత్సంబంధాలు ఉన్నాయని తెలిపారు. తన ప్రియ శిష్యుడు అయిన కుసుంపురం గ్రామానికి చెందిన బొంతల కోటి సత్యవర ప్రసాద రావు సహాయం తో ఈ ప్రాంతం లో తన ప్రదర్శనలు విస్తృతంగా చేవడుతున్నట్లు తెలిపారు. ఉద్దాన ప్రాంత ప్రజలు సంగీతంపై మక్కువతో కళాకారులకు ప్రోత్సహిస్తుంటారని అన్నారు. ఈ ప్రాంతంలో కళాకారులు ఎక్కువ మొత్తంలో ఉన్నారని వివిధ రంగాల్లో తమ ప్రదర్శనలు చేపట్టి మంచి పేరు సంపాదించిన కళాకారులు ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచల ఆగమ పాఠశాల వేద పండితులు ముప్పిరాల నారాయణమూర్తి, సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి ,మడమల రాంబాబు భాగవతార్, ఆలయ అర్చకులు రాజు స్వామి,రాజేష్ స్వామి, మృదంగ అద్వాన్సులు లోళ్ల రాంబాబు, గ్రామస్తులు జి రామూర్తి, పి శ్రీనివాసరావు,బి మోహన్ రావు, ధనుంజయం తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర-పొందూరు : మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవాలని మండల న్యాయ సేవా సంఘం ఛైర్మెన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి వి.ఎస్.వి.బి. కృష్ణసాయితేజ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల లో భాగంగా పొందూరు ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు గల చట్టాలు, హక్కులుతో పాటు బాలికా సంరక్షణ, భార్య, భర్తల మధ్య తగాదాలు వంటి పలు అంశాలుపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కె.రమణమూర్తి, కె.రఘుబాబు, అశోక్ కుమార్, పి. రామ్మోహన్, పి.సురేష్ కుమార్, బ్రహ్మాజీ, పలువురు మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థుల 3, 5 సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసినట్లు డీన్ డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. 64 పరీక్ష కేంద్రాల్లో డిగ్రీ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 15 నుంచి 28వ తేదీ వరకు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం రెండు నుంచి ఐదు గంటల వరకు నిర్వహిస్తారని ఈ పరీక్షలకు 12 వేల మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. డిగ్రీ ఐదవ సప్లమెంటరీ పరీక్షలు ఈనెల 15 నుంచి 29వ తేదీ వరకు ఉదయం తొమ్మిది నుంచి 12 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. పరీక్షలు షెడ్యూల్ వివరాలు వర్సిటీ వెబ్సైట్లో విద్యార్థులకు అందుబాటులో ఉంచామని చెప్పారు.

విద్యార్థులకు ఆట వస్తువులు వితరణ

విశాలాంధ్ర-పలాస : పలాస ఎంపిపి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పలాస లయన్స్క్లబ్ ఆఫ్ క్యాజు ల్యాండ్ వనిత ఆధ్వర్యంలో శనివారం ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు మల్లా జయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. ఆటలు ఆడే సమయంలో ఆటలాడాలని చదువుకున్న సమయంలో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఆటలకు సంబంధించి టెన్నిస్ రింగ్స్, స్కిప్పింగ్ల రోప్స్, వాలీబాల్స్, చెస్బోర్డు, లుడి బోర్డు, క్యారంబోర్డుతో పాటు పలు రకాల ఆట వస్తువులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తర్లాన శ్వేతకుమారి, మల్లా సంతోషి, బల్ల ఉషా, కొంచాడ జ్యోతి, దేవరశెట్టి జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా స్వామివారి గరుడవాహన సేవ

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బెజ్జిపుట్టుగ శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామివారి డోలోత్సవ, ధ్వజ ప్రధ్వం బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ ధర్మకర్త పొందల కుమారి, కృష్ణారావు దంపతుల ఆర్థిక సహకారంతో స్వామివారి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవ,అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చక్ర పెరుమాళ్ళ స్వామి వారికి గరుడ వాహనంపై ఊరేగింపు కార్యక్రమం చేపట్టి మ్రొక్కును తీర్చుకున్నారు. అనంతరం ప్రధమ బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా సింహాచల ఆగమ పాఠశాల వేద పండితులు ముప్పిరాల నారాయణమూర్తి శిష్య బృందం చే యాగశాలలో ప్రధాన విశేష హెూమాలు,యాగశాల హెూమాలు, విశేష నైవేద్యం, వేద విన్నపములు,నీరాజనం కార్యక్రమం చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బందరుకు చెందిన మడమల రాంబాబు భాగవతార్ చే హరికథ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పి కృష్ణారావు,పివీఎస్ రాంబాబు,పి విజయ్ కృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేపాడ చిరంజీవిని గెలిపించటం మన బాధ్యత

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : సరుబుజ్జిలి మండలం దకరవలస పంచాయితీలో ఎమ్మెల్సీ ఎన్నికల భాగంలో తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి వేపాడ చిరంజీవికి మద్దతుగా ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అంబాల రాంబాబు, మండల పార్టీ తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, మండల నాయకులు కందుల వెంకటరావు, కొర్ను సూర్యనారాయణ, మీసాల రామారావు, బెవర లక్ష్మణరావు దకరవలస గ్రామ మాజీ సర్పంచ్ అడపక అప్పలనాయుడు, కార్యకర్తలు ప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళిలో : అన్ని రకాలుగా అర్హత కల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు అని, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి రెడ్డి అప్పన్న అన్నారు. శనివారం సంతబొమ్మాళి మండలం చినతుంగామ్, కాపు గోదాయవలస, గోవిందాపురం, కోటపాడు, నరసాపురం, వడ్డివాడ పంచాయతీలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు శివప్రసాదరావు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, కింజరాపు యువదళం పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-పలాస : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత రెండు రోజులుగా మున్సిపల్ కార్మికులు పనులు బంద్ చేసి నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ రాజగోపాలరావులు స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ కార్మికుల పి.ఎఫ్ డబ్బులు 33 లక్షల 52వేల రూపాయలు కార్మికుల ఖాతాలను జమ చేయకుండా 11సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అనేసార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కార్మికులు గురువారం నుంచి పనులు బంద్ చేశారు. శనివారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.బలరాం, సిఐటియు జిల్లా నాయకులు ఎన్.గణపతి, కార్మిక నాయకులు సి.హెచ్.మురగన్, జె.రవి, ఎస్.రమేష్, బి.కూర్మారావు, కార్మికులందరి సమక్షంలో కమిషనర్ టి.రాజగోపాల్, చైర్మన్ బల్ల గిరిబాబులు చర్చించి 20వ తేదీలోగా పిఎఫ్ డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే సెలవులు మంజూరులో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చనిపోయిన కార్మిక కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగం ఇవ్వాలని, ఇన్సూరెన్స్ డబ్బులు, పింఛను మంజూరు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దివాకర్, శంకర్, తిరుపతి, సీతమ్మ, సావిత్రి, శకుంతల, గులాబిలు పాల్గొన్నారు.

చిరంజీవిని గెలిపించాలి

విశాలాంధ్ర-మందస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ టీడీపీ అభ్యర్థి వేపాడ చిరంజీవిరావును ఉత్తరాంధ్ర పట్టభద్రులు ఓటు వేసి గెలిపించాలని ప్రముఖ వ్యాపారవేత్త జి.కె.నాయుడు అన్నారు. శనివారం మండలం లింబుగాం, లోహరిబంద గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి తాతారావు, మండల లచ్చయ్య, లబ్బ రుద్రయ్య, ఎం.నవీన్కుమార్, పులారి వీరాస్వామి, తలగాన రాజశేఖర్, మండల మాధవరావు, అడ్డి దండాసి, అందాల రామారావు, బద్రి కోదండరావు, అందాల మోహనరావులు పాల్గొన్నారు.

నేను సర్దార్ గౌతు లచ్చన్న శిష్యుడనే

మాజీ మంత్రి పితాని సత్యన్నారాయణ

విశాలాంధ్ర-పలాస : ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు గౌతు లచ్చన్న తన గురువు అని, ఆయన శిష్యరికంలో రాజకీయంగా ఎంతో ఎత్తుకు ఎదిగానని, ఆయన కుమారుడు గౌతు శివాజీ హుందాగా రాజకీయాలు నడుపుతున్నారని మాజీ మంత్రి పితాని సత్యన్నారాయణ అన్నారు. టీడీపీ రాష్ట్ర అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం పలాస టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గం క్లస్టర్ ఇన్చార్జీల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతు కుటుంబం ఎన్నోఏళ్లుగా ప్రజాసేవ చేసి ప్రజల ప్రేమాభిమానాలను పొందారని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ రాజకీయంగా అధికారంలో లేకపోయినా రాజకీయ విలువలతో బతుకుతున్నారన్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లాకు ఇన్చార్జీగా పనిచేసినప్పుడు అనేకమందిని కలిసానని, జిల్లా రాజకీయాలు హుందాగా ఉండేవని అన్నారు. స్థానిక మంత్రి చేస్తున్న రాష్ట్ర పరిపాలనపై విమర్శలు చేశారు. ఈ ప్రాంతం మైనింగ్ మాఫియాగా మార్చారని, వైకాపా వ్యతిరేక మేధావి వర్గం ఓట్లుపై దృష్టి సారించాలని అన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ బలపర్చిన వేపాడ చిరంజీవిరావును గెలిపించేందుకు క్లస్టర్ ఇన్చార్జీలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గౌతు శివాజీ, నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జీ గౌతు శిరీషా, టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పి.విఠల్, లొడగల కామేష్యాదవ్, బద్ద నాగరాజు, గురిటి సూర్యనారాయణ, జి.కె.నాయుడు, దువ్వాడ సంతోష్, సప్ప నవీన్, సాంబమూర్తి, శశిభూషణ్, సూరాడ మోహనరావు, ఉమామహేశ్వరరావు, దుర్యోధన, రట్టి లింగరాజు, రుద్రయ్యలు పాల్గొన్నారు.

తొలగించిన కల్వర్టు దిమ్మ

విశాలాంధ్ర వార్తకు స్పందన

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం కొత్తపేట నుంచి పాకివలసకు వెళ్ళే సర్వీసు రోడ్డులో కిష్టపురం జంక్షన్ సమీపంలో రోడ్డుకు మధ్యలో ఉన్న కల్వర్టు (కాన) దిమ్మవల్ల తరుచు ప్రమాధాలు జరుగుతున్నాయని సంబంధి అధికారులు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకో పోవడంతో ప్రమాధాలు జరిగిన 'అధికారులు పట్టించుకోరా..' అనే శీరీక్ష విశాలాంధ్ర దినపత్రికలో ఈనెల 2వ తేదీన ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ కల్వర్టును అధికారులు శనివారం తొలగించారు. దీంతో వాహనదారులు విశాలాంధ్ర దిన పత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రతిభా పురస్కారాల్లో మెళియాపుట్టి జెడ్పీ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మెళియాపుట్టి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు దల్లి స్రవంతి, బొడ్డ మానసలు కోరమండల్ ఫెర్టిలైజర్ సంస్థ వారు ప్రతి ఏటా నిర్వహించే విద్యాభివృద్ధి-సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారాలకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో శనివారం శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగే అవార్డు ప్రధాన ఉత్సవ కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ కీర్తికృష్ణ, జిల్లా వ్యవసాయశాఖధికారి కె. శ్రీధరులు ప్రధమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3,500వేలు నగదు, మెమెంటో, సర్టిఫికెట్లును విద్యార్థులకు అందజేశారు. ఈ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణపతిరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం. ఫాల్గుణరావు, ఇతర పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పి సవరయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రబీ సీజన్‌లో 3500 ఎకరాల్లో వేరుశెనగ సాగు

టెక్కలి ఏడీఏ బి.వి. తిరుమలరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో రబీసీజన్లో 3500 ఎకరాల్లో వేరుశెనగ సాగు రైతులు చేస్తున్నారని, ప్రస్తుతం ఈ సాగు పూత పిందె దశలో ఉందని టెక్కలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.వి.తిరుమలరావు అన్నారు. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం స్థానిక వ్యవసాయాధికారి ఎస్. గోవిందరావుతో కలిసి మండలం పెద్దబమ్మిడి గ్రామంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించి వారికి వేరుశెనగ సాగువద్దకు తీసకువెళ్ళి వారికి సాగుకు సోకే వ్యాధులు, నివారాణ చర్యలు గుర్చి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సాగుకు పొగాకు లద్దెపురుగు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉందని, దీని నివారణకు ఇమామెక్టన్ బెంజిమెట్ ఒక ఎకరాకు 100 గ్రాములు మందు 200లీటర్లు నీటిలో కలిపి పిచకారి చేయాలని సూచించారు. అదేవిధంగా కాలర్రాట్ కూడా మొక్కలకు వచ్చి చని పోతాయని దీని నివారణకు డైథేన్ ఎం-45 అను మందును ఒక ఎకరాకు 400 గ్రాములు నీటిలో కలిపి పిచకారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి : న్యాయమూర్తి హరిత

విశాలాంధ్ర-మెళియాపుట్టి : విద్యార్థి దశలోనే విద్యార్జనతో పాటుగా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టెక్కలి ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి హరిత అన్నారు. శనివారం నాడు మెళియాపుట్టి మండల కేంద్రంలో గల దుక్క రాజన్న రెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో లీగల్ లిటరసీ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి హరిత మాట్లాడుతూ ఎనిమిదవ తేదీన జరుపుకోబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు ముందస్తుగా తెలియజేశారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలియజేస్తూనే బాల్యవివాహాలు నేరమని, ప్రస్తుత సమాజంలో బాల్యవివాహాలు చేసుకోరాదని, వివాహాలు చేసుకునేటప్పుడు వధూవరులు మాట్లాడుకుని పరస్పర అంగీకారంతోపాటుగా కుటుంబ పెద్దల సహకారంతో పెళ్లిళ్ల చేసుకోవాలని, వరకట్నం నేరమని, గృహహింస నిరోధక చట్టంతో పాటుగా పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటర్మీడియట్ స్టేజ్లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచి ప్రణాళిక యుతంగా ముందుకు సాగి బంగారు భవితకు బాటలు వేసుకోవడంతోపాటు భవిష్యత్తులో పదిమందికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో ఆమెతోపాటు తహసిల్దార్ సరోజిని, కళాశాల ప్రిన్సిపాల్ వైకుంఠరావు, ఎంపీడీవో చంద్రకుమారి, ఎస్సైరాజేష్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ధర్మరాజు, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు తదితరలున్నారు.

జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : జిల్లా పరిషత్ సీఈఓ ఆర్. వెంకట్రామన్ శనివారం మండలంలోని ఎస్ఎస్ వలస సచివాలయం, అర్బన్ హౌసింగ్ లేఅవుట్లు ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పాత్రునివలసలో గల అర్బన్ హౌసింగ్ లేఅవుట్లు 1,2 పరిశీలించి ఇళ్ళు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్శనలో ఎంపీడీవో వి. రఘు, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం నేలలోని సూక్ష్మజీవుల భాండాగారం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : మండలం రోనంకి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులు 800 లీటర్ల ద్రవ జీవామృతం తయారు చేశారు. ఈ జీవామృతం లైన్ షోయింగ్ పద్ధతిలో వేసినటువంటి రాగి పంట కోసం తయారు చేసుకున్నట్లు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలియజేశారు. ప్రకృతి సేద్యంలో రైతులు పంటలకు అవసరమైనటువంటి ఎరువులను తయారు చేసుకోవచ్చని, జీవామృతం తయారు చేసుకొని నేలకు అందించడం వలన నేలలోని పంట ఎదుగుదలకు అవసరమైన సూక్ష్మజీవులు ఎక్కువ సంఖ్యలో అభివృద్ధి చెంది పంటలకు అవసరమైనన్ని పోషకాలను అందిస్తాయన్నారు. ఈ జీవామృతం నేలకు అందించడం వలన నేల సూక్ష్మజీవుల భాండాగారంగా తయారవుతుందని, రైతులు ప్రకృతి సేద్యంలో పంటలు పండించడం వలన రైతులకు పంట పెట్టుబడులు ఉండవని, అలాగే దిగుబడులు గణనీయంగా పెరుగుతాయన్నారు. రైతులు అందరూ కూడా ప్రకృతి సాగు చేయాలని అందులో ముఖ్యంగా జీవామృతం పాత్ర చాలా కీలకమని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కరరావు, కల్పన రైతులకి వివరించారు.

మార్చి 9 నుండి సమస్యల పరిష్కారానికి ఏపీజేఏసీ ఉద్యమం

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యయ, కార్మిక, రిటైర్డు కాంట్రాక్టు అండ్ ఔట్ సోర్సింగు ఉద్యోగుల దీర్ఘకాలిక ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి గత ఏడాది ఫిబ్రవరి నెలలో 11వ పిఆర్సీ అమలులో భాగంగా జరిగిన ఉద్యమం సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రివర్గ ఉప సంఘం అంగీకరించిన డిమాండ్లు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యదోరణి తో సమస్యలు పరిష్కారంలో జాప్యం చేస్తున్నందునే మార్చి 9 నుండి ఏప్రిల్ 3 వరకు దశలవారిగా ఉద్యమానికి సిద్ధపడి, ఆందోళన కార్యక్రమాలు ప్రారంబించ బోతున్నామని, 'ఇది ప్రభుత్వానికి వ్యతిరేక పోరాటం కాదని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సాదనకోసం చేపడుతున్న పోరాటమని ఏపిజెఏసి అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మరియు రాష్ట్ర మున్సిపల్ మినిస్టీరియల్ ఉద్యోగుల అధ్యక్షుడు ఎస్. కృష్ణమోహన్, శ్రీకాకుళం జిల్లా ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ కె.శ్రీరాములు తెలిపారు. శనివారం స్థానిక రెవిన్యూభవన్ లో శ్రీకాకుళం జిల్లా ఉద్యోగులను ఉద్యమానికి సిద్ధం చేసేందుకు ముందుగా జిల్లా, డివిజన్ స్థాయి అన్నీ శాఖల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశాంలో ముఖ్యఅతిధులుగా పాల్గొన్న కృష్ణ మోహన్, డీజీ ప్రసాదరావు, అంజనీకుమార్ లు మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపిజెఏసి అమరావతి నాయకులు మాట్లాడుతూ స్వయానా ఉద్యోగసంఘాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు కానప్పుడు ఇంకా ఎవరికి చెప్పుకోవాలో అర్ధంకాని పరిస్దితిలో ఈ ఉద్యమానికి సిద్ధపడ్డామన్నారు. ఉద్యోగుల జీతభత్యాల కొరకు కేటాయించిన బడ్జెట్ ఎమౌతుందో తెలియడంలేదని, అసలు మా డబ్బులు ఎవరికి మళ్లీస్తున్నారు? మాకు ప్రతి నెలా పనిచేసిన కాలానికి ఒకటో తారీకు జీతాలు/పెన్సన్ లు ఎందుకు ఇవ్వరు? మా జీతాలు/ పెన్సన్ లు కోసం నిధులు కేటాయించలేదా? కేటాయిస్తే, ఎందుకు ప్రతి నెల జీతాలు 20వ తేదీ వరకు ఇస్తూనే ఉన్నారు? మేము దాచుకున్న డబ్బులు ఏమయ్యాయి? ఇలాంటి అనేక ఆర్ధికపరమైన అంశాలు అన్నింటిపైన స్పష్టమైన లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని, అలాగే దీర్ఘకాలికంగా పరిష్కారం కానీ ఆర్ధికేతర సమస్యలు కూడా తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ముందుగా ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ ప్రకారం మార్చి 9 నుండి రాష్ట్రవ్యాప్తంగా చేపట్ట బోవు ఉద్యమం దశలవారిగా ఉధృతం అవుతుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి వేణుగోపాలరావు, ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీ పి శ్రీనివాసరావు, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి బి.వి.వి.యెన్.రాజు, గ్రామవార్డు సచివాలయాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ యెస్ గోవిందరావు , రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు డి.పి.దేవ్ , ఆర్డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పి.పి.సూర్యనారాయణ తదితరులు ఈ ఉద్యమంలోఅన్ని శాఖల ఉద్యోగులు మమేకమై ఉద్యమాన్ని ఉధృతం చేసి మన డిమాండ్లు సాదించటానికి శక్తీ వంచన లేకుండా కృషిచేయాలని పిలిపు నిచ్చారు. శ్రీకాకుళం పట్టణంలో మునిసిపల్ కార్యాలయం, జిల్లాపరిషత్ కార్యాలయం మరియు ఇతర శాఖల కార్యాలయాల సందర్శనలి - లిఉద్యమ కార్యాచరణలో పాల్గొనమని సిబ్బందినీ స్వయంగా ఆహ్వానించిన రాష్ట్ర జేఏసీ కమిటీ, శ్రీకాకుళం మున్సిపల్ కమీషనర్ సి.ఓబులేసు వారిని కలసి ఉద్యమానికి సహకరించమనికోరడం జరిగింది

పన్ను బకాయిలను చెల్లించండి : మున్సిపల్ ఆర్డీ నాగరాజు

విశాలాంధ్ర-ఆమదాలవలస : పురపాలక సంఘానికి బకాయి పడిన పన్నులను సకాలంలో చెల్లించి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని విశాఖపట్నం రీజియన్ పుర పరిపాలనా ప్రాంతీయ సంచాలకులు వి.నాగరాజు కోరారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పురపాలికల్లో రోజు రోజుకు పెరిగిపోతున్న పన్ను బకాయిలు తో అభివృద్ధికి విఘాతం కలుగుతోందన్నారు. పరి శీలనలో భాగంగా వేసవి త్రాగునీటి ఎద్దడి పై తీసుకోనున్న కార్యాచరణను కమీషనరు కె.అప్పలనాయుడు (పూ.అ.భా) ను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరచాలని, వీధిలైట్లు నిర్వహణ క్రమ బద్దీకరించాలని, అక్రమ కట్టడాలు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణల పై విమర్శలకు తావులేకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని సూచించారు. సందర్శనలో భాగంగా స్థానిక కంపోస్ట్ యార్డు ను పరిశీలించారు. యార్డులో చెత్త నిర్వహణపై అనుసరించాల్సిన వ్యూహంపై సూచనలు చేశారు. పరిశీలనలో ఏ.ఈ బి.శృజన, టీ.పి.ఎస్ హెచ్.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలన సక్రమంగా జరగాలంటే టీడీపీ అధికారంలోకి రావాలి

టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్

విశాలాంధ్ర -సరుబుజ్జిలి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు కూన రవికుమార్, సరుబుజ్జిలి మండలంలో వున్న ప్రభుత్వ కార్యాలయాలు, హైస్కూల్‌లు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలలు, సచివాలయలు, మండల తాసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ ఆఫస్ లలో పని చేస్తున్న ఉద్యోగులను కలిశారు. తెలుగుదేశం పార్టీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవికి, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించమని కోరారు. ఉద్యోగ భద్రత కావాలన్నా, ఒకటో తారీఖుకు జీతం రావాలన్న టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాలా సూర్యనారాయణ, మండలి అధ్యక్షులు అంబాల రాంబాబు, తడెలా రాజారావు, కూటికుప్పల కోటేశ్వర రావు, కోమనపల్లి రవికుమార్, కొర్ను సూర్యనారాయణ మరియు టీడీపీ మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వైకాపా ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : వైకాపా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతమరాజు సుధాకర్ ను గెలిపించాలంటూ, వైకాపా పార్టీ నాయకులు శనివారం భావనపాడు మర్రిపాడు తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, అదే పార్టీ అభ్యర్థికి గెలిపిస్తే అభివృద్ధి పథకాలు అందరికీ అందే అవకాశం ఉంటుందని ఓటర్ల కు, వైకాపా నాయకులు తెలియజేసారు. సర్పంచ్‌లు బుడ్డా మోహన్ రెడ్డి, అట్టాడ కల్పన రాంప్రసాద్ రావు ఆధ్వర్యంలో సచివాలయాల ఉద్యోగులు, అర్హులైన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిది మేరుగు అప్పారావు, జెడ్పిటిసి పాల వాసంతరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు (గోవిందరావు), మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు మోడీ భాస్కర్ రెడ్డి, మండల వైకాపా పార్టీ కన్వీనర్ కోత సతీష్, మండల వైస్ ఎంపిపి ప్రతినిధుల పొందల రామకృష్ణ, నక్క భీమారావు, మేఘవరం పంచాయతీ సర్పంచ్ పరపటి సునీత శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ భత్సల సుధాకర్, చేనేత కార్మికుల సంఘం అధ్యక్షుడు కొన్న రాము, వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా సాగిన గుర్రాల పరుగు పందెం

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో శ్రీ రామాలయ 9వ వార్షికోత్సవ వేడుకలు గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు మాజీ ఉప సర్పంచ్ అప్పలనాయుడు దంపతుల సారథ్యంలో, శుక్ర,శనివారాలలో అంగరంగ

వైభవంగా జరిగాయి. అలాగే శనివారం సాయంత్రం 4గంటల నుంచి డిసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చిన రాము నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రాల పరుగు పందాలు ఉత్కంత భరితంగా సాగగా, ఇందులో మొదటి బహుమతి చోడమాంబిక విక్రం గుర్రం రామన్నపాలెం గెలుచుకోగా,రెండవ బహుమతి అలమండ శ్రీనురాజు గుర్రం గెలుచుకోగా, 3వ బహుమతి సింగపూర్ సత్యనారాయణ గుర్రం గెలుసుకుంది.అనంతరం పోటీలలో గెలుపొందిన గుర్రాల యజమానులకు నగదు బహుమతిని అందించడం జరిగింది.అలాగే పోటీల్లో పాల్గొన్న బహుమతులు రాని గుర్రాలకు ప్రోత్సాహ ప్రైజ్ గా వెయ్యి రూపాయలు చొప్పున ఇవ్వడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ యువకులను ఉర్రూతలూగించింది. మూడు రోజుల వార్షికోత్సవ వేడుకలను విజయవంతం చేసినందుకు చుట్టుపక్కల గ్రామ ప్రజలకు మరియు జాకేరు గ్రామ ప్రజలకు గ్రామం సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు అప్పలనాయుడు దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అరిగిపాలెం ఎంపీటీసీ తొండవరపు వెంకటరమణ,చిన గుడిపాల సర్పంచ్ బోజంకి రామనాయుడు, ఎన్ కె ఆర్ పురం ఉప సర్పంచ్ కండిపల్లి పెదనాయుడు,దుల్ల అప్పన్న తదితర నాయకులు పాల్గొన్నారు.

రీసర్వేలో ఎదురయ్యే సమస్యలు పరిష్కరించండి

కలెక్టర్ సుమిత్ కుమార్



విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లాలో జరుగుతున్న జగనన్న భూహక్కు, భూరక్షా పథకం లో భాగంగా రి సర్వేలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో రీసర్వే నోడల్ ఆఫీసర్స్ మరియు తహసిల్దార్ల తో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రీసర్వే లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటిని అధిగమించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలను విస్తృతంగా చర్చించి దిశా నిర్దేశం చేశారు. సమస్యలకు సరైన మార్గాలను చూపుతూ రీసర్వే ప్రక్రియను వేగవంతం చెయ్యాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రీసర్వేలో అమలు అవుతున్న చట్టబద్ధమైన నోటీసులను తగిన విధంగా భద్రపరచాలని ఆదేశించారు. ప్రతి తహసిల్దార్ కార్యలయములో రీసర్వే రికార్డ్ భద్రపరుచాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అందుకు అవసరమైన బీరువాలను ఏర్పాటు చేయాలని తక్షణ ఆదేశములు జారీ చేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పిఓ రోణంకి గోపాలకృష్ణ, సబ్ కలక్టర్ వి. అభిషేక్ రీసర్వే వేగావంత0 చేయుటకు తగిన సూచనలు అందజేశారు. ఈ సమావేశ0లో డిఆర్ఓ పి. అంబేద్కర్ , పాడేరు డివిజన్ తహసిల్దార్లు, మండల సర్వేయర్లు మరియు ఎడి సర్వే వై. మోహనరావుతో పాటు సర్వే శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

2 సంవత్సరాలలోపు పిల్లలందరికీ టీకాలు శత శాతం వేయాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ మురళీదర్

విశాలాంధ్ర-రావికమతం : 2సంవత్సరాలలోపు పిల్లలందరికి టీకాలు శత శాతం వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్. మురళీధర్ సూచించారు.కొత్తకోట పిహెచ్‌సి పరిధిలోశనివారం కొత్తకోట 1, మత్సవానిపాలెం గ్రామాలలో జరుగుతున్న టీకాలు కార్యక్రమాన్ని శనివారంఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టీకాలకు ఉపయోగించే పరికరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆశా కార్యకర్తలు ఆయా గ్రామాల్లో అర్హులైన చిన్నారులు అందరికీ టీకాలు గురించి తెలియజేయాలన్నారు. తగుజాగ్రత్తలు తీసుకొని సిబ్బంది టీకాలు వేయాలన్నారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారిణి రజని,ఎంపీహెచ్ఈ ఓ సుబ్బారావు ఎం పి హెచ్ ఎస్ మల్లిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కరకవలస వద్ద పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-జలుమూరు : మండలం కరకవలస వద్ద శ్రీముఖలింగం, గొట్టాబ్యారేజ్ రహదారిలో కల్వర్టు వద్ద ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారిలో ఒక్కసారిగా పెద్ద మలుపు ఉండటంతో పాటు కల్వర్టుకు రెండు వైపులా రక్షణ గోడలు లేవు. దీంతో చిన్న పొరపాటు జరిగినా 10 అడుగుల లోతు గెడ్డలో పడిపోవాల్సిందేనని వాహనదారులు చెబుతున్నారు. చాలా ఏళ్లుగా ఇలాగే ఉన్నా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గెలిచే వరకు తగ్గేదేలే....

సువ్వారి గాంధీ

విశాలాంధ్ర-సరుబుజ్జిలి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎలక్షన్ సంబంధించి మండలంలోని పట్టబద్రుల ఓటర్ల జాబితాలను, పంచాయతీల పరిధిలో పరిశీలించి, మండలంలోని కార్యకర్తలందరు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వైస్సార్సీపీ నాయకులు సువ్వారి గాంధీ దిశా నిర్దేశం చేశారు. ప్రతి పంచాయతీని ఆయనే స్వయంగా పరిశీలించి గెలుపు ఓటములు అంచనాలు వేస్తున్నారు. ఏలా అయన ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ గెలిచితీరాలని, గెలుపుకు సంబందించిన ఏమార్గమైన విడిచిపెట్టరాదని తెలిపారు.

వరి పంటలో రాజిలేని సుత్రాలు పాటించాలి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : మండలంలోని జరజం పంచాయతీ జారజాం మరియు గొలివివాని పేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం రైతులు చేత వరి పొలంలో జిగురు పూసిన అట్టలను పెట్టించారు. ఇవి పెట్టడం వలన పంటలో వచ్చిన ఏవైనా చిన్న చిన్న పురుగులు, వచ్చదోమ ఈ జిగురుకు అంటుకొని చనిపోవడం జరుగుతుంది. ఈ విధంగా పంటలో దోమ మరియు ఏదైనా పురుగుల ఉధృతిని తెలుసుకొనవచ్చు. రైతులు ముఖ్యంగా ప్రకృతి సేద్యంలో వరి పంటల్లో నాట్లు వేసినప్పటినుండి రాజీలేని సూత్రాలు పాటించినట్లయితే ఏ విధమైనటువంటి ఖర్చు ఉండదు. పురుగులు తెగుళ్లను సమర్థవంతంగా ఈ ప్రకృతి సాగులో నివారించవచ్చు. అందువలన రైతులందరూ కూడా ప్రకృతి సేద్యంలో వరి పంటలను పెట్టుబడి లేకుండా అధిక దిగుబడి వచ్చేలా పండించవచ్చని రైతులకు సిబ్బంది అయినా ధనుంజయ్ వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, హరే రామ్ మరియు రైతులు పాల్గొన్నారు

నేటి మెరుగైన విద్యే రేపటి అభివృద్ధి

విశాలాంధ్ర-పొందూరు : నేటి మెరుగైన విద్యే రేపటి అభివృద్ధికి సోపానాలవుతున్న దృశ్య పాఠశాల పిల్లల్లో మెరుగైన విద్య బోధనతో తర్ఫీదు కలిగించి రేపటి తరానికి మేధావులుగా చూడాలన్న సంకల్పంతో మండలంలోని 25 ప్రైమరీ స్కూల్ 25 అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను బెజ్జిపురం యూత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్కూల్ రెడీనెస్ బాల్ వికాస్ ప్రోగ్రాములు భాగంగా కమ్యూనిటీ ఆర్గనైజర్ కాళ్ళ శ్రావణి ఆధ్వర్యంలో స్కూల్ ఉపాధ్యాయులు అంగన్వాడీ కేంద్రాలకు 50 టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన స్వరలయ కచేరి

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని చండి పుట్టుగ గ్రామంలో శాస్త్రీయ సంగీత వైలెన్ మృదంగ స్వరలయ కచేరి కార్యక్రమం గ్రామస్తులు, యువకులు, చండి పుట్టుగ సంగీత కళాకారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చెన్నైకు చెందిన పద్మశ్రీ ఏ కన్యాకుమారి (వయోలిన్), హైదరాబాద్ కు చెందిన పద్మశ్రీ మృదంగ సామ్రాట్ యల్లా వెంకటేశ్వరరావు (మృదంగం), చెన్నైకు చెందిన కలై మామిని వైకం గోపాలకృష్ణన్ (ఘటం), బెంగుళూరుకు చెందిన వయోలిన్ సామ్రాట్ నిశాంత్ చంద్ర (వయోలిన్) లచే ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత వయోలిన్ మృదంగం స్వరలయ కచేరి కార్యక్రమం సంగీత ప్రియులకు ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం కళాకారులకు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలి

వ్యవసాయధికారి దానకర్ణుడు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం పెంపొందుతున్న ప్రస్తుత తరుణంలో ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మెళియాపుట్టి మండల వ్యవసాయధికారి దానకర్ణుడు అన్నారు. నవధాన్యాల సాగు - నేలతల్లి బాగు కార్యక్రమాన్ని మెళియాపుట్టి మండలంలో కొసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. వ్యవసాయధికారి, విఏఏ యమునల ఆధ్వర్యంలో పాఠశాలలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, రైతులు, ప్రకృతి వ్యవసాయం పై పలు సలహాలు అందించారు. వరి పంట వేసే ముందు జూన్, జూలై నెలలలో సేంద్రీయ కర్బనం మరియు ఇతర పోషకాలు అభివృద్ధి చెందటానికి పచ్చి రొట్టి విత్తనాలు, పప్పుదినుసులు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, చిరుధాన్యాలు వంటి 18 నుండి 33 రకాలు విత్తనాలు ఒక ఎకరా పొలంలో వేసుకుంటే ప్రధాన పంటకు మంచి ఎరువుగా ఉపయోగపడటంతో పాటు పశువులకు మేతగా ఉపయోగపడుతుందని, అలాగే ప్రధాన పంటకు ఎరువుగా పనిచేయడంతో పాటు రసాయనిక ఎరువులు ఖర్చులను తగ్గి, నాణ్యమైన పంట చేతికి అందడంతో పాటు భూసారంలో జీవన వైవిధ్యం పెరిగి నేల గుల్లభారుతుంది, నీటి సామర్థ్యం పెరుగుతుందని, వానపాములు వృద్ధిచెంది, భూసారం పెరుగుతుందని, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మీకాంతం తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యాస గీత, హైమావతి, పాపయ్య, ధనుంజయరావు, జయలక్ష్మి, కుర్మారావు, కాంతమ్మ, ధర్మరాజు, బోధనా సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.

ఉద్యోగుల భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమావేశం

విశాలాంధ్ర-బెలగాం : ఎపి జెఎసి అమరావతి పార్వతీపురం మన్యం జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్థానిక బెలగాం ఎన్జీఓ హోంలో ఉద్యోగుల భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ నిమిత్తం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిధులుగా ఎపి జెఎసి అమరావతి ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఎపి మున్సిపల్ మినిస్టీరిల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్. కృష్ణమోహన్ రావు, ఎపి జెఎసి అమరావతి సలహా సంఘ సభ్యులు, పార్వతీపురం మన్యం జిల్లా సెక్రటరీ జనరల్ డిజి ప్రసాదరావు, రాష్ట్ర నాయకులు కోన ఆంజనేయ కుమార్ (చంటి), పి. భానుమూర్తి, ఎస్. నాయుదుబాబు, పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ జి. శ్రీరామమూర్తి, సహధ్యక్షులు మరిపి శ్రీనివాసరావు, హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎపిలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి రోజు రోజుకు చాలా దయనీయమైన పరిస్థితికి నెట్టబడుతుంది. అది చివరికి ఏస్థాయికి వచ్చిందంటే ఉద్యోగులు పనిచేసిన కాలనికి 1వ తేదీన జీతాలు, పెన్షన్ లు చెల్లించండి మహాప్రభో అని అడుక్కోవాల్సిన పరిస్థితి గతంలో ఏ ప్రభుత్వం హయాంలోను ఇలాంటి పరిస్థితులు దాపురించలేదని, ఈ పరిస్థితులన్నింటిని ప్రభుత్వ పెద్దలకు ప్రభుత్వ ఉన్నతాధికార్లుకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సరే ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎటువంటి చొరవ చూపడంలేదు సరికదా నిర్లక్ష్యదోరణితో వ్యవహరిస్తున్నందున తప్పనిసరి పరిస్థితులలో రాష్ట్రవ్యాప్తంగా దశలవారి పోరాటాలతో ప్రారంభించి చివరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించుకొనేందుకు ఎటువంటి పోరాటాలకైనా ఉద్యోగులను సిద్ధం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకుపోతూ ఆందోళనా కార్యక్రమాలలో ప్రతి ఉద్యోగి పాల్గొవాలని కోరారు. ఈనెల 9వ తేదీ నుండి ఉద్యమ కార్యచరణ ప్రారంబించి దశలవారిగా ఏప్రిల్ 3వ తేదీ వరకు కొనసాగిస్తామని, ఏప్రిల్ 5వ తేదీన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం యొక్క స్పందనను బట్టి భవిష్యత్ లో ఉద్యమాన్ని ఉదృతం చేసేందుకు కీలకనిర్ణలు తీసుకుంటామన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అన్ని డిపార్టుమెంట్లలోను, అన్ని కేటగిరీలలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ అర్హత గల వారికి రావల్సిన పదోన్నతులు వెంటనే కల్పించాలని, అనేక డిపార్టుమెంట్లలో, వివిధ కేటగిరీల సమస్యల పైన ఇప్పటికే లిఖితపూర్వకంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన వాటన్నింటిని పరిష్కరించుకొనేందుకు, జీతాలు, పెన్షన్లు సకాలంలో పొందేందుకు, రావల్సిన బకాయిలు సాదించుకొనేందుకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసుకొనేందుకు, 11 వ పిఆర్ సి నష్టాలను సరిచేసుకొనేందుకు అంతా ఒక్కటై పోరాటం చేయకపోతే భవిష్యత్ అంతా అందకారమే అవుతుందని, ఇప్పటికే ప్రభుత్వం జీతాలు 20వ తేదీలోగా ఇస్తున్నాం కదా అంటున్నారని, భవిష్యత్ లో జీతం కూడా మనకు రావాల్సిన బకాయిలు మాదిరిగానే ఎప్పుడో ఒకప్పుడు డబ్బులు ఉన్నప్పుడు ఇస్తామనే పరిస్థితి వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. ఇలాంటి పరిస్థితులు రాకముందే మనమంతా ఒక్కటై మనమధ్య ఉన్న విభేదాలు మరచి ఒక్కటీ కావాలని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు సాధనకోసం చేపట్టబోతున్న ఈ ఉద్యమానికి అందరి మద్దతు ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఇంకా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వమే బాధ్యత వహించాలని, ఉద్యోగుల డిమాండ్లు అన్ని ప్రభుత్వం ఇచ్చిన హామిలేనని, ఇవేమి గొంతెమ్మ కోర్కెలు కాదని, సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇంకా జాప్యం జరిగితే ఈ ఉద్యమం ద్వారా ప్రజలకు జరిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సివస్తుందని, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాదన కోసం చేపడుతున్న ఈ ఉద్యమానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామని అలాగే ఈ ఉద్యమానికి అన్ని ట్రేడ్ యూనియన్లు, ప్రజాసంఘాలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల బాద్యులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీలేరులో ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటుపై హర్షం



విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం అప్పర్ సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించి ఇంటర్ విద్యార్థులకు సీలేరులోనే ఇంటర్మీడియేట్ పరీక్షా కేంద్రం కేటాయించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో 50కిలో మీటర్ల దూరంలో ఉన్న జీకేవీధి వెళ్లి ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి ఇంటర్ పరీక్ష రాయడం జరిగేదన్నారు. కానీ ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు సీలేరులో కళాశాలలోనే సెంటర్ కేటాయింపు జరగడం హర్షనీయమన్నారు. దీనికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

కూచిపూడిలో ప్రదర్శనకు సోంపేట బాలలు

విశాలాంధ్ర-సోంపేట : కూచిపూడి గ్రామంలో జరుగుతున్న శ్రీగంగా బాల త్రిపుర సుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనకు సోంపేటకు చెందిన శ్రీనటరాజ నాట్యమండలి చిన్నారులు శనివారం ప్రయాణమయ్యారు. ఇద్దిి వాసుదేవు, ఐ.స్వాతి, ద్రాక్షాయణి, కె.శ్రీలక్ష్మి, ఆర్.స్నేహలకు ప్రదర్శనలో పాల్గొనేందుకు అవకాశం లభించినట్లు నాట్య గురువు బిందుశ్రీ తెలిపారు.

ఎరువుల యాజమాన్యంతోనే అధిక దిగుబడులు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఎరువుల యాజమాన్యంతోనే అధిక దిగుబడులు సాధించే వీలుందని కృషి విజ్ఞాన కేంద్రం (ఆమదాలవలస) శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక అన్నారు. మండలంలోని రామ జోగిపేట గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు పలు సూచనలు చేశారు. వాతావరణ మార్పులు, పంటలపై వాటి ప్రభావం రైతులకు వివరించారు. శ్రీకాకుళం డివిజన్ ఏడిఏ బి రజిని మాట్లాడుతూ మిత్ర పురుగులు రక్షించుకోవడంతోనే నాణ్యమైన ఉత్పత్తులు వస్తాయన్నారు. రైతు శిక్షణా కేంద్రం ఏవో సూర్యకుమారి, వ్యవసాయ అధికారి వై సురేష్ , ఎఈఓ పి దుర్గాప్రసాద్, మండల సలహా మండలి సభ్యుదు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిభిరాలు వినియోగించుకోండి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఉచిత పశు వైద్య శిభిరాలు రైతులు వినియోగించుకోవాలని సంతబొమ్మాళి మేజర్ పంచాయతీ సర్పంచ్ ప్రతినిది డాక్టర్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు అన్నారు. శనివారం వెంకటాపురం లో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈనెల 5న ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-మాకవరపాలెం : మాకవరపాలెం కొత్తవీధిలో భారత్ గ్యాస్ కంపెనీ వద్ద క్రీస్తు ప్రార్థన మందిరం ఆవరణలో ఏబి ఛారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం జరగనుందని నిర్వాహకులు తెలిపారు. రక్తదానం చేసిన వారికి లక్ష రూపాయల బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

వైసీపీ అభ్యర్థి కోసం మెంటి మహేష్ ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-పెందుర్తి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ వైసీపీ అభ్యర్థి సీతం రాజు

సుధాకర్ గెలుపు కోసం ఆ పార్టీ జీవీఎంసీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ నాలుగో రోజు ఇంటింటి ప్రచారం చేశారు. శనివారం వార్డు పరిధిలోని శ్రమశక్తి నగర్ లో పట్టభద్రుల ఓటర్లను కలిసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపాదించిన సీతంరాజును మంచి మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. సౌమ్యుడు నిరాడంబరుడు అయిన సీతంరాజు గెలుపుతో విశాఖ నగరం మంచి అభివృద్ధి సాధిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రమశక్తి నగర్ సాంబ మూర్తి, దామోదర్, దయానందమూర్తి, నరసింగ్, సందీప్, సత్యనారాయణ,చిదంబరం, మజ్జి రఘు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభకు మద్దతుగా ప్రచారం



విశాలాంధ్ర-మాకవరపాలెం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పీడిఎఫ్ అభ్యర్థిని కోరెడ్ల రమాప్రభకు మద్దతుగా మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం సచివాలయంలో బిఎస్పీ కన్వీనర్ బొట్టా నాగరాజు ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బహుజనులైన దళిత, గిరిజన, వెనుకబడిన బీసీ కులాలు, మైనారిటీలకు చెందిన పట్టభద్రులు పీడిఎఫ్ అభ్యర్థిని రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించి, అగ్రవర్ణాల పార్టీలకు బుద్ధి చెప్పి, బహుజనుల గొంతును వినిపింపజేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షాన ప్రశ్నించే వ్యక్తినే పార్టీలకు అతీతంగా ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.అప్పలనాయుడు, చంద్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.